సాక్షి
బాపట్ల

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

నూజెండ్ల: సీతారామపురం ఎస్వీఎస్ఎస్సీ ప్రభుత్వ పాఠశాలకు శిష్టా సుధాకర్ జ్ఞాపకార్థం వారి కుమార్తె నాగమణి అదే పాఠశాలకు కంప్యూటర్ బహూకరించారు.



పీడీఎస్ బియ్యం పట్టివేత

నరసరావుపేట:జిల్లా వ్యాప్తంగా అధికారులు దాడులు నిర్వహించి 45.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ షాపులు, రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు.



చెరువులో మొసలి సంచారం

పిడుగురాళ్ల: గుత్తికొండ గ్రామ చెరువులో మొసలి సంచరించడాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులకు సమాచారం ఇచ్చారు.

న్యూస్‌రీల్

రైతు సంక్షేమంతోనే దేశం సంక్షేమం

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె: రైతు సంక్షేమంతోనే దేశ సంక్షేమమన్న దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో శనివారం అన్నదాత సుఖీభవ నగదును రైతులకు పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. పథకం కింద ఎవరికైనా సందేహం ఉంటే 155251 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి పరిష్కారం చేసుకోవచ్చన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకట మురళి చేతుల మీదగా అన్నదాత సుఖీభవ నగదును విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నేలపు రామలక్ష్మి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఏడీఏ అద్దేపల్లి లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, అనగాని శివప్రసాద్, గూడపాటి శ్రీనివాసరావు, జీవీ నాగేశ్వరరావు, మేకా వెంకట శివరామకృష్ణ, జీపీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 7,508 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి శనివారం 7,508 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు 316, బ్యాంక్ కెనాల్‌కు 1,807, తూర్పు కాలువకు 749, పశ్చిమ కాలువకు 283, నిజాంపట్నం కాలువకు 488, కొమ్మూరు కాలువకు 2,900 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇక బ్యారేజీ నుంచి 1,89,625 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక ఆర్.అగ్రహారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం శ్రీనివాస కల్యాణం, పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి భక్త బృందం, వామనాశ్రమ స్వామిజీ వారి ఆధ్వర్యంలో చేపట్టారు. వామనాశ్రమ స్వామీజీ మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణం వల్ల వివాహ పవిత్రత, కుటుంబ విలువలు తెలుస్తాయని చెప్పారు. వేద పండితులు (తిరుపతి) శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త అనంతలక్ష్మి (హైదరాబాద్) శ్రీనివాస వైభవాన్ని భక్తులకు తెలిపారు. అనంతరం స్వామిజీ భక్తులను ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందించారు. తటపర్తి రాంబాబు, నేరెళ్ల హరి, ఎల్ఎస్ఆర్.ఆంజనేయులు, మహంకాళి శ్రీనివాసరావు, బాపారావు, రఘు, జుజ్జూరు శ్రీనివాసరావు. త్రిపురమల్లు వాణి పాల్గొన్నారు.

దర్గాలో నిర్మాణాలు కూల్చివేత



పెదకాకాని: బాజీబాబా దర్గాలో శిథిలావస్థకు చేరిన గదుల నిర్మాణాలను వక్ఫ్‌బోర్డు అధికారులు పొక్లయిన్‌తో కూల్చివేయించారు. గత నెల 28న గుంటూరు జిల్లా పెదకాకాని బాజీబాబా దర్గాను సందర్శించిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ శిథిలావస్థకు చేరిన గదులు కూలితే భక్తులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ఆ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు దర్గా ఈఓ శనివారం షెడ్డును కూల్చివేయించారు. త్వరలో మాస్టర్ ప్లాన్ రూపొందించి నూతనంగా గదులను నిర్మించడం జరుగుతుందని ఈఓ తెలిపారు.

ప్రశ్నిస్తే దాడులా..?

అన్నదాతల కష్టాలు తీర్చాలని కోరితే దాడులు చేసి కొడతారా? ఇదేమి దుర్మార్గం. ప్రభుత్వం వ్యవహరించే తీరిదేనా? అంటూ జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. సాగునీటి కాలువల్లో పూడిక పేరుకుపోయి, గుర్రపు డెక్క పెరిగి నీటిపారుదల సక్రమంగా లేదు. ఫలితంగా రైతులు ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటను కోల్పోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు దీక్ష చేపట్టారు. సమస్యను పరిష్కరించకపోగా ప్రభుత్వం భౌతికదాడులకు దిగింది. పచ్చనేతల ఆదేశాలతో అశోక్‌బాబుపై పోలీసులు దాడికి తెగబడడాన్ని ప్రజాస్వామికవాదులు ఖండిస్తున్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

- ఏడాదిగా కాలువలను పట్టించుకోని ప్రభుత్వం
- పెరిగిపోయిన గుర్రపు డెక్క, తూటికాడ
- పంట కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు
- కాలువలు పూడిక తీసి రైతులను ఆదుకోవాలంటూ పది రోజులుగా ఆందోళన
- ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక దీక్షకు దిగిన వరికూటి
- వరికూటిపై దాడిచేసి కొట్టిన పోలీసులు
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా ఆగ్రహం
- ఆస్పత్రిలో కొనసాగుతున్న అశోక్‌కుమార్ దీక్ష



గుర్రపుడెక్కతో నిండిన రేపల్లె పరిధిలోని పేటేరు డ్రెయిన్



రేపల్లె పరిధిలోని వాడ మురుగు డ్రెయిన్ దుస్థితి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా వ్యాప్తంగా కృష్ణా, సాగర్ కాలువలతోపాటు చెరువులు, కుంటల కింద కాలువలు గుర్రపు డెక్క, తూటికాడ, పూడికతో నిండిపోయాయి. ఒకవైపు కాలువలకు నీరు వదిలినా పంట పొలాలకు నీరు చేరే పరిస్థితి లేదు. ఎన్నికల సమయంలో రైతులపక్షమంటూ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ఏరుదాటాక బోడిమల్లన్న చందంగా వ్యవహరిస్తూ.. ఏపని చేయక వంచనకు పాల్పడుతోంది. కాలువల్లో పూడిక తీయకపోతే సమీపంలో ఉండే పొలాలు తప్ప దూరంగా ఉన్న పంట పొలాలకు నీరు చేరే పరిస్థితి లేదు. వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలంలో గంగోలు కాలువలో మూడు కిలో మీటర్లమేర గుర్రపు డెక్క, తూటికాడ పెరిగింది. వేమూరు మండలం జంపని డ్రెయిన్లతోపాటు అన్ని కాలువల్లో ఇదే పరిస్థితి. రెండువారాల కిందట మండలంలోని చంపాడు వద్ద కాలువలోని తూటికాడలో ఇరుక్కొని పోతుమర్రికి గ్రామం రైతుకు చెందిన మూడు గేదెలు మృతిచెందాయి.

ముందుకు కదిలే దిక్కు లేదు..

రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల పరిధిలోని వాడమురుగు డ్రెయిన్, జగజ్జేరు కాలువ, రేపల్లె ఓల్డు కోర్సు, న్యూకోర్సు, ఆర్ఎం డ్రెయిన్, బీఎం డ్రెయిన్లలో పూడికతోపాటు గుర్రపు డెక్క, తూటికాడ పెరిగింది. కాలువలకు నీటిని విడుదల చేసినా సక్రమంగా పంటలకు చేరే పరిస్థితి లేదు. బాపట్ల నియోజకవర్గంలో తూర్పు శాంప్, నల్లమడ, తుంగభద్ర, భీమునికుంట వాగు, మరుపురోలువారి పాలెం స్ట్రెయిట్‌కట్ ప్రధాన కాలువలతోపాటు వాటి పరిధిలోని పంటకాలువలు మొత్తం పూడిక, తూటికాడ, గుర్రెపుడెక్క, నాచుతో నిండిపోయాయి.

కొనసాగుతున్న దీక్ష

పోలీసులు దౌర్జన్యం చేసి దాడికి తెగబడినా అశోక్‌బాబు ఆస్పత్రిలోనే దీక్షను కొనసాగిస్తున్నారు. కాలువలు బాగుచేసి రైతులను ఆదుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు కార్యకర్తలు వరికూటికి మద్దతుగా నిలిచి ఉద్యమానికి మద్దతు పలుకుతున్నారు. ఈ ఉద్యమం మరింత ఉధృతంగా కాకముందే ప్రభుత్వం తప్పు తెలుసుకొని తక్షణం సాగునీటి కాలువల్లో పూడిక తొలగించే పనులకు శ్రీకారం చుట్టాలని జిల్లా రైతాంగం కోరుతోంది.

అరకొరగా పనులు

అద్దంకి నియోజకవర్గం పరిధిలో సంతమాగులూరు మొదలుకొని కొరిశపాడు మండలం పమిడిపాడు వరకు అద్దంకి బ్రాంచ్ కెనాల్, పర్చూరు ప్రాంతంలోని పర్చూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని సాగర్ కాలువల పరిధిలో కొంతమేర కాలువ పూడికతీత లైనింగ్ పనులు చేసినా మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు కాలువల్లో డ్రాపుల రిపేరు పనులను ప్రభుత్వం పట్టించుకోలేదు. చీరాల నియోజకవర్గ పరిధిలోనూ కాలువల ఆధునికీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చివరి ఆయకట్టులో పూడికతీత పనులనూ ప్రభుత్వం పట్టించుకోలేదు.



జంపని డ్రెయిన్ గుర్రపు డెక్కలో చిక్కుకుని మృతి చెందిన పశువు (ఫైల్)

వరికూటి ఉద్యమానికి బాసటగా రైతులు

బాపట్ల జిల్లావ్యాప్తంగా ఉన్న పరిస్థితిని ఎత్తి చూపి ఇప్పటికే కాలువలకు నీరు విడుదల అయినందున తక్షణం అన్ని ప్రాంతాల్లోనూ పూడిక తీత పనులు చేపట్టాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో పది రోజుల కిందట నేరుగా కాలువలోకి దిగి పరిస్థితిని అధికారుల కళ్లకు కట్టారు. ఆ తర్వాత కాలువలు శుభ్రం చేయకపోతే ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. అంతటితో వదలక సమస్య పరిష్కరించకపోతే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. శుక్రవారం రేపల్లె ఇరిగేషన్ కార్యాలయం ఎదుట దీక్షకు దిగారు. పనులు చేసి లేదా చేస్తామని హామీ ఇచ్చి, తక్షణం పనులు మొదలుపెట్టి వరికూటితో దీక్ష విరమింప చేయాలే తప్ప అవేమీ చేయకుండా పోలీసులు వచ్చి అశోక్‌బాబును చుట్టుముట్టి బలవంతంగా ఎత్తుకెళ్లి పిడిగుద్దులతో కుళ్లపొడిచి స్పృహతప్పి పడిపోయేలా దాడి చేశారు. పార్టీలకతీతంగా రైతులకు న్యాయం చేయమని అడిగితే పోలీసులను పెట్టి కొట్టించడంపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. పార్టీలకతీతంగా అన్నదాతలు కొందరు ప్రత్యక్షంగా మరికొందరు పరోక్షంగా వరికూటికి మద్దతుగా నిలుస్తున్నారు.



పోలీసుల దాడిలో వరికూటి చొక్కా చినిగిపోయిన దృశ్యం

రేపల్లెలో బాలుడు కిడ్నాప్

- తల్లి ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు
- సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి గుర్తింపు
- విజయవాడలో అరెస్టు
- సురక్షితంగా తల్లి వద్దకు బాలుడిని చేర్చిన పోలీసులు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది

రేపల్లె: బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితుడిని రేపల్లె పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంటల వ్యవధిలో పట్టుకున్నారు. బాలుడిని తల్లికి అప్పగించారు. కేసు వివరాలను పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు శనివారం వెల్లడించారు. రేపల్లె పట్టణానికి చెందిన ఉప్పాల శ్రీలక్ష్మి, ప్రసాద్‌లకు ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి 4 సంవత్సరాల బాలుడు భాను సిద్ధార్థ ఉన్నాడు. మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు కొద్దికాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. పట్టణంలోని మూడో వార్డుకు చెందిన ముమ్మలనేని చరణ్ తనతో సహజీవనం చేయాలంటూ కొంత కాలంగా శ్రీలక్ష్మిని వేధిస్తున్నాడు. శ్రీలక్ష్మి నిరాకరించటంతో ఆమె కుమారుడిని కిడ్నాప్ చేసేందుకు చరణ్ పథకం పన్నాడు. భాష్యం స్కూలులో ఎల్‌కేజీ చదువుతున్న భానుసిద్ధార్థ శుక్రవారం సాయంత్రం స్కూలు నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్న క్రమంలో బలవంతంగా ఆటో నుంచి సిద్ధార్థను తీసుకుని చరణ్ పరారయ్యాడు. తల్లి శ్రీలక్ష్మి ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి నిందితుడు చరణ్ కోసం గాలింపు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడు విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. విజయవాడ బస్టాండ్‌లో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి బాలుడిని సురక్షితంగా తల్లికి అప్పగించారు. గంటల వ్యవధిలో కేసును ఛేదించటంతో బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ తమ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నీరు వచ్చే..రాకపోకలు నిలిచే..

ప్రభుత్వ అలసత్వం.. పనుల్లో జాప్యం ఫలితంగా 30 గ్రామాల ప్రజలకు సమస్యగా మారింది. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగానే.. సాగర్ నీటిని అద్దంకి బ్రాంచ్ కాలువ ద్వారా దిగువకు విడుదల చేశారు. దీంతో నీటి ప్రవాహ ఉధృతికి డైవర్షన్ రోడ్డు కోతకు గురవడంతోపాటు శనివారం నుంచి బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచాయి.

- ఏబీసీకి నీరు విడుదల
- నిలిచిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు
- బల్లికురవ-అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్‌లో రాకపోకలకు బ్రేక్
- 30 గ్రామాల ప్రజల అవస్థలు
- అనాలోచితంగా వర్షాకాలంలో పనులు ప్రారంభం
- హామీ తప్పిన కాంట్రాక్టర్, అధికారులు



నీటి ఉధృతికి కోతకు గురవుతున్న డైవర్షన్ రోడ్డు

బల్లికురవ: 33/0 వల్లాపల్లి లాకులు సమీపంలో బల్లికురవ-అద్దంకి ఆర్అండ్‌బీ రోడ్డులో అద్దంకి బ్రాంచ్ కాలువ వద్ద ఉన్న బ్రిడ్జి జీర్ణావస్థకు చేరింది. దీంతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం గత నెలలో రూ.1.65 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే వర్షాకాలం పంటల సీజన్ కావడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ సమయంలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడితే సాగర్ కాలువ ద్వారా నీటి విడుదల కష్టమేనని భావించారు. అయితే ఆగస్టు 15 నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి పంటల సాగుకు.. రాకపోకలకు ఇబ్బందులు తొలగిస్తామని కాంట్రాక్టర్‌తోపాటు ఆర్అండ్‌బీ అధికారులు ప్రకటించారు. కానీ అందుకు విరుద్ధంగా తాగు, సాగునీటి అవసరాల నిమిత్తం ఇటీవల కుడికాలువకు నీటిని విడుదల చేశారు. అయితే అద్దంకి బ్రాంచి కెనాల్‌లోని 31 మైలు వద్ద ఏబీసీకి అడ్డుకట్ట వేసి భవనాసి ఎస్కేప్ చానల్‌కు నీరు మళ్లించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

ప్రవాహ ఉధృతికి తెగిన కట్ట

ఏబీసీలో 31వ మైలు వద్ద వేసిన అడ్డుకట్ట పటిష్టంగా ఏర్పాటు చేయలేకపోవడంతో నీటి ప్రవాహ ఉధృతికి కట్ట తెగి దిగువకు నీరుపారింది. పనులు జరుగుతుండగానే దిగువకు నీరు రావడంతో ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ అయోమయంలో పడ్డారు. 33/0 వద్ద జరుగుతున్న హై లెవెల్ బ్రిడ్జికి సంబంధించి కాలువలో నాలుగు పిల్లర్లకుగాను రెండు పిల్లర్ల పనులు పూర్తయ్యాయి. నీటి ప్రవాహం జరిగితే పనులు చేపట్టడం కష్టమే.

కోతకు గురైన డైవర్షన్ రోడ్డు

వాహనాల రాకపోకల కోసం కాలువలో ఏర్పాటుచేసిన డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. బల్లికురవ- సంతమాగులూరు మండలాల్లోని 20 గ్రామాల ప్రజలు అద్దంకి వెళ్లాలన్నా.. అద్దంకి మండలంలోని 10 గ్రామాల ప్రజలు నరసరావుపేట వెళ్లాలన్న ఈ బ్రిడ్జి మీదుగానే వెళ్లాలి. భారీ వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించినా.. ప్రస్తుతం బైక్‌లు కూడా ఈ డైవర్షన్ రోడ్డులో వెళ్లే పరిస్థితి లేదు. వాహనదారులు, ప్రజలు ఎటు వెళ్లాలా అని అయోమయంలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కావాలన్నా కష్టమేనని ప్రజలు, అధికారులు భావిస్తున్నారు. వేసవి కాలంలో జరగాల్సిన పనులు ఇప్పుడు చేయటమే ఈ ఇబ్బందులకు ప్రధాన కారణమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిలిచిన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులు

అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలి

ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దివ్యసాయి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దివ్యసాయి

రేపల్లె: సెప్టెంబర్ 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్యసాయి తెలిపారు. పట్టణంలోని సబ్‌కోర్టు హాలులో శనివారం కోర్టు పరిధిలోని పోలీసుస్టేషన్‌ల అధికారులతో సమావేశం నిర్వహించారు. దివ్యసాయి మాట్లాడుతూ పరిష్కరించదగిన కేసులను, రాజీ మార్గాన్ని ఎంచుకున్న కక్షిదారుల కేసులను, క్రిమినల్, సివిల్ ప్రీలిటిగేషన్ వంటి కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యేలా పనిచేయాలని తెలిపారు. లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు తమ సమస్యలను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతాభార్గవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ.వెంకటగిరిధర్, సెక్రటరీ యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌లో సత్తా చాటాలి

నరసరావుపేట రూరల్: విద్యార్థులల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిని పరిశోధనల వైపు దృష్టి సారించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్‌లపై కేసానుపల్లిలోని ఎంఏఎం కళాశాలలో శనివారం జిల్లా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లు ఉండాలని తెలిపారు. ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు, యూపీ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు నామినేషన్లు చేసే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇన్‌స్పైర్ నామినేషన్‌లలో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు ప్రయోగశాలలకు కావాల్సిన పరికరాలను సమకూర్చుకొని విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలని తెలిపారు. అనంతరం ఇన్‌స్పైర్ మనక్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఏఎం కళాశాలల చైర్మన్ ఎం.శేషగిరిరావు, డీఎస్‌వో ఎస్.రాజశేఖర్, పూర్వ డీఎస్‌వో ఏఏ మధు కుమార్, రిసోర్స్ పర్సన్స్ సిహెచ్ వీరప్పయ్య, వి.సీతారామయ్య, టి.శ్రీనివాసరావు, టి.పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునకొండకు పోటెత్తిన పర్యాటకులు

లాంచీస్టేషన్ వద్ద నాగార్జునకొండకు వెళ్ళి వస్తున్న పర్యాటకులు



విజయపురి సౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండకు శనివారం పర్యాటకులు పోటెత్తారు. నాగార్జునసాగర్ డ్యాం 18 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు సాగర్‌కు చేరుకొని డ్యాం గేట్లు తిలకించిన అనంతరం నాగార్జునకొండకు చేరుకున్నారు. నాగసిరి, అగస్త్య లాంచీలలో కొండకు వెళ్లారు. దీంతో లాంచీస్టేషన్‌కు రూ.1,00,450 ఆదాయం చేకూరినట్లు టూరిజం అధికారులు తెలిపారు. కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుడి ప్రతిమలు, రాతి సామగ్రి, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానాల గట్లు, బోది వృక్షం చూసి తన్మయత్వం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపీ స్టేడియం, శ్రీరంగనాథస్వామి దేవాలయం, అనంతరం 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. నాగార్జునసాగర్ డ్యాంపై గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో నూతన బ్రిడ్జి, పాత వంతెన, లాంచీస్టేషన్, కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి.



సాగర్ క్రస్ట్‌గేట్ల వద్ద సెల్ఫీలు దిగుతున్న సందర్శకులు

క్లుప్తంగా

ఫోర్జరీ నిందితులకు రిమాండ్

యద్దనపూడి: ఫోర్జరీ సంతకాలతో భూమిని కాజేయాలని ప్రయత్నించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని న్యాయస్థానం ముందు హాజరు పరచగా 17 రోజుల రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాలన గ్రామానికి చెందిన మల్లా పోలమ్మ 2014 డిసెంబర్‌లో చనిపోయారు. ఆమెకు చెందిన 0.76 ఎకరాల భూమిని కాజేయాలనే ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన మల్లా పోలయ్య, కోటయ్య, కృష్ణ, ఏడుకొండలు, రమేష్, నాంచారయ్యలు 2017లో ఆమె వేలిముద్రలతో ఫోర్జరీ పత్రాలు సృష్టించారు. ఈ పత్రాలతో గతంలో చిలకలూరిపేట న్యాయస్థానంలో దావా వేసి, విక్రయ ఒప్పందంపై మధ్యంతర ఉత్తర్వులు కూడా పొందారు. అయితే, పోలమ్మ కుమారుడు వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ టి. శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

విజయపురి సౌత్: మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో గత 3 రోజుల క్రితం గల్లంతైన మత్స్యకారుడు దోనె ధనరాజు(40) మృతదేహం శనివారం లభ్యమైనట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ తెలిపారు. గత రెండు రోజులుగా ఎస్‌ఐ అశోక్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో మృతదేహం కోసం తీవ్రంగా జలాశయంలో గాలించారు. అనుపునకు సమీపంలో ధనరాజు మృతదేహాన్ని గుర్తించి బయటకు వెలికి తీశారు. ధనరాజు మృతికి ప్రమాదవశాత్తు జరిగిందా ఏదైనా కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్‌ఐ అశోక్ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గొర్రెలు, మేకల పెంపకం సంఘానికి అన్యాయం

సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి

సంతమాగులూరు(అద్దంకి): కూటమి ప్రభుత్వం గొర్రెలు, మేకల పెంపక సంఘానికి రూపాయి కేటాయించలేదని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే పూర్తిగా అమలు చేయలేదని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి పిలుపునిచ్చారు. శనివారం బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, ఎంకే పాలెం, మామిళ్ళపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి, మహాసభల కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 17 ,18 వ తేదీల్లో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం ఈ మహాసభల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెంపకందార్లు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి సమగ్ర కార్యాచరణ రూపకల్పన చేయబోతున్నట్లు తెలియజేశారు. రాష్ట్రంలో వ్యవసాయానికి అనుబంధంగా గొర్రెల పెంపకం జీవనాధారంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్ల 21 లక్షల గొర్రెల మేకల సంపద ఐదువేలకు పైగా పెంపకం దార్ల సహకార సంఘాలు, సుమారు నాలుగు లక్షల కుటుంబాలపైగా ఈ రంగంపై ఆధారపడి బతుకుతున్నారన్నారు. గ్రామీణ స్థాయిలో సొసైటీల్లో జిల్లా స్థాయిలో యూనియన్లు, రాష్ట్రాల్లో ఫెడరేషన్ ఏర్పాటు చేసినా, వాటికి తగిన నిధులు ప్రభుత్వాలు కేటాయింపు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ సమాజానికి బలమైన నాణ్యమైన, పౌష్టికాహారం అందిస్తున్న కీలకమైన రంగాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయన్నారు. బీమా పథకాలు సరిగా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మందులు, టీకాలు, డీ వార్మింగ్ కోసం బడ్జెట్లో నిధులు పెంచాల్సిన అవసరం ఉందని నా బార్డు ద్వారా 50% సబ్సిడీ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతిరావు, రాష్ట్ర బాధ్యులు పూసపాటి వెంకట్రావు, బాపట్ల జిల్లా సంఘం కార్యదర్శి బుర్రి ఆంజనేయులు, చిమట సైదులు, పెద సింగరయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

- గంటల వ్యవధిలోనే కేసు ఛేదించిన పోలీసులు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన బాలుడిని బంధువులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ ఖాదర్‌బాషా

కారంచేడు: ఇంటి వద్ద ఆడుకుంటూ బయటకు వచ్చిన నాలుగు సంవత్సరాల బాలుడు తప్పిపోయాడు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు, బంధువులు కారంచేడు పోలీస్‌లకు సమచారం అందించారు. రంగంలోకి దిగిన కారంచేడు ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా తమ సిబ్బందితో మూడు టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గంటల వ్యవధిలోనే బాలుడిని క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన వివరాలు... కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన చింతా సుబ్బారావు తన కుమారుడు ఎప్పటిలాగానే ఆడుకుంటూ బయటకు వచ్చాడు. ఎవరూ గమనించకపోడవంతో బాలుడు కుంకలమర్రు–చీరాల మధ్య షటిల్ సర్వీస్‌గా తిరిగే పల్లెవెలుగు బస్సు ఎక్కేశాడు. బస్సులో ప్రయాణికులు, కండక్టర్ కూడా గమనించలేదు. చీరాలలో బస్సు దిగిన బాలుడు మరలా చిలకలూరిపేట వైపు వెళ్లే పల్లె వెలుగు బస్సు ఎక్కి పర్చూరులో దిగాడు. ఈ విషయం జరిగిన వెంటనే బాలుని అమ్మమ్మ పొత్తూరి కాంతమ్మ మరికొంత మంది వెతుకుతూ ఉండగా అదే గ్రామానికి చెందిన మరియమ్మ అనే మహిళ బాలుడు బస్సు ఎక్కడం గమనించానని తెలిపింది. వెంటనే వారు కారంచేడు ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బాలుడి ఫొటోను సోషల్ మీడియా, సమీప పోలీస్‌స్టేషన్‌లకు అందించారు. అది గమనించిన పర్చూరు ఎస్‌ఐకి బాలుడు కనిపించడంతో వెంటనే కారంచేడు ఎస్‌ఐకి సమాచారం అందించారు. ఉదయం 11 గంటల సమయంలో మిస్ అయిన బాలుడిని ఒంటి గంటకు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. కేవలం గంటల వ్యవధిలోనే బాలుడిని అప్పగించారు. బాలుడి ఆచూకీ కోసం కృషి చేసిన ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా, పోలీస్ సిబ్బందిని బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి సర్కార్ విఫలం



మాట్లాడుతున్న రాంబాబు

- రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోని వైనం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పాలెపోగు రాంబాబు

బాపట్లటౌన్: రైతులను ఆదుకోవడంలో కూటమి సర్కారు ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పి.రాంబాబు విమర్శించారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పొగాకు రైతులను ఆదుకోవడంలో కూటమి సర్కారు విఫలమైందన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం 20 మిలియన్ టన్నుల పొగాకునే రైతుల నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఒక్కొక్క రైతు నుంచి 20 కింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని తీర్మానించడంతో మిగతా పొగాకు ఎవరు కొంటారు ఎప్పటికీ కొంటారనే రైతులు లబోదిబోమంటున్నారన్నారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 56 మంది పొగాకు రైతులు మృతి చెందారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మరుప్రోలు కొండలురెడ్డి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జోగి రాజా, బీసీ సెల్ నాయకులు శాయిల మురళి, తన్నీరు అంకమ్మరావు, పిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

పొన్నూరు: ఆర్థిక లావాదేవీల విషయంలో ఏర్పడిన వివాదంలో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పలు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు పొన్నూరు పట్టణ ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మునిపల్లె గ్రామానికి చెందిన గొడ్డేటి శ్యాంకుమార్‌కు వట్టికూటి సత్య సాయిబాబు, వట్టికూటి వెంకట రామానాయుడు, గుత్తికొండ రాజేష్‌లకు ధాన్యానికి సంబంధించిన సుమారు రూ.40 లక్షల బాకీ విషయంలో వివాదం నెలకొంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని నేపథ్యంలో శ్యాంకుమార్ జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఏడాది మే 8వ తేదీన ఆ ఫిర్యాదు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు రావడంతో పోలీసుస్టేషన్ ఎదుట ఇరువర్గాలు మాట్లాడుకునే క్రమంలో వాగ్వాదం జరిగింది. తనను కులం పేరుతో దూషించారని శ్యాంకుమార్ ఫిర్యాదు చేశాడు. స్టేషన్ బయట రోడ్డుపై జరగడంతో శ్యాంకుమార్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ మెకానిక్ మృతి



అద్దంకి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిన ఘటనలో ట్రాక్టర్ మెకానిక్ మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని కలవకూరు రహదారిలో శనివారం జరిగింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన అల్లా ఉద్దీన్ (45)ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతను అద్దంకి పట్టణంలో ఒక షెడ్ ఏర్పాటు చేసుకుని ట్రాక్టర్లు రిపేర్ చేస్తుంటాడు. ప్రతి రోజూ అద్దంకి వచ్చి రాత్రికి తిరిగి వెళుతుంటాడు. ఈ క్రమంలో అద్దంకి నుంచి బైక్‌పై స్వగ్రామం వెళుతుండగా కలకూరు రహదారిలో కారు, బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో మెకానిక్ మృతి చెందాడు. మృతునికి భార్య ఫాతిమా బీ, ఇద్దరు పిల్లలున్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించిన ఉత్తర్వులు దహనం చేసిన ఏఐఎస్ఎఫ్



లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ తీవ్రంగా ఖండించారు. గుంటూరు కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం సర్కిల్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉత్తర్వులు విద్యార్థి హక్కులపై దాడిగా భావిస్తూ, తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు చెప్పడతామని హెచ్చరించారు.

మిరప పంటకు బీమా గడువు పొడిగింపు

నరసరావుపేట రూరల్: మిరప సాగుచేసే రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గడువు తేదీని పెంచినట్టు పల్నాడు జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐ.వెంకట్రావు శనివారం తెలిపారు. మిరప సాగు చేసే రైతులు ఎకరాకు రూ.360లు ప్రీమియం చెల్లించినట్టయితే బీమా మొత్తం రూ.90వేలు వర్తిస్తుందని వివ రించారు. పంటల సాగు కోసం బ్యాంకుల నుంచి రుణాలు పొందే వారికి బ్యాంకులే ప్రీమియం వసూలు చేసి బీమా కంపెనీకి చెల్లిస్తాయని తెలిపారు. బ్యాంకు రుణం పొందిన వారికి ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు తెలిపారు. పంట రుణాలు తీసుకోని రైతులు తమ సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ లేదా సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్, పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించవచ్చని సూచించారు.

న్యాయమైన హక్కులను కాపాడాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ఫ్యాప్టో జిల్లా చైర్మన్ నరసింహారావు

గుంటూరు వెస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి విముక్తి కలిగించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామ కాలు, సీపీఎస్ రద్దు, మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టడంతోపాటు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని తెలిపారు. 18 రకాల డిమాండ్ల సాధన కోసం ధర్నా నిర్వహిస్తున్నామని నరసింహారావు తెలిపారు. అనంతరం డీఆర్వో షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరాంజనేయులు, కో–చైర్మన్ బి.సత్యం, రాజశేఖర్, జి.వేళాంగిణి, తిరుమలేష్, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి రాఘవ జీవితం స్ఫూర్తిదాయకం

ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్

బాపట్ల: ప్రముఖ రంగస్థల నటుడు, సామాజిక సంస్కర్త బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకొని బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్, , ఆర్డీవో గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, తహసీల్దార్ షేక్ షాలీమా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని రాఘవ చిత్రపటానికి పూలమాల వేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బళ్లారి రాఘవ కేవలం నటుడేగాక సామాజిక విలువలకు ప్రాధాన్యమిచ్చిన కళాకారుడని పేర్కొన్నారు. భావోద్వేగాలకు, వాస్తవికతకు ప్రాధాన్యమిచ్చిన ఆయన నాటకాలు సమాజాన్ని చైతన్యపరిచేలా ఉన్నాయని కొనియాడారు. కళను వినోదంగా కాకుండా సామాజిక మార్పు కోసం వేదికగా వాడిన ఘనత రాఘవదేనన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన బళ్ళారి



బళ్ళారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి బళ్ళారి రాఘవ అని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం బళ్ళారి రాఘవ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి కొత్త ఒరవడిని తీసుకొచ్చిన ప్రఖ్యాత సాహితీవేత్త, నాటక కారుడు అని అన్నారు. ఆయన రచించిన రఘునందన, హరిశ్చంద్ర, ద్రౌపది వంటి క్లాసిక్ నాటకాలకు నాట్యరంగంలో చరిత్రాత్మక స్థానం దక్కాయని చెప్పారు. తెలుగు నాటక రంగానికి నూతన శైలిని పరిచయం చేశారని పేర్కొన్నారు. నాటక ప్రదర్శనల్లోని పాత్రల్లో జీవం పోసే మేటి నటుడిగా పేరు గడించారని అన్నారు. కార్యక్రమంలో ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు శంకరరావు, సుభాషిణి, ఎంటీ ఆర్ఐ శ్రీహరిరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం ఏ సమస్య పరిష్కరించలేదు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

చిలకలూరిపేట: కేంద్రంలో 11 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో శనివారం సీపీఐ ఏరియా మహాసభ నిర్వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు అధికారం లేనప్పుడు ఒక విధంగా అధికారం వచ్చిన తర్వాత మరోవిధంగా ఉంటారని విమర్శించారు. ఇచ్చిన హామీల మేరకు పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు నివాస స్థలం ఇవ్వాలన్నారు. సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆనాడు లోకేష్ స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టమని చెప్పారని ఇప్పుడు అందుకు విరుద్ధంగా స్మార్ట్ మీటర్లు కొనసాగిస్తున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 7, 8 తేదీలలో వినుకొండలో నిర్వహిస్తున్నామని 7వ తేదీ మధ్యాహ్నం వేలాదిమంది ప్రజలతో భారీ ప్రదర్శన, శివయ్య స్థూపం వద్ద బహిరంగసభ జరుగుతుందని, సభలను విజయవంతం చేయాలని కోరారు.

నూతన కార్యవర్గ ఎంపిక...

సీపీఐ ఏరియా కార్యదర్శిగా తాళ్లూరి బాబురావు, సహాయ కార్యదర్శిగా బొంతా ధనరాజ్, పట్టణ కార్యదర్శిగా చెరుకుపల్లి నిర్మలతో పాటు 11 మంది ఏరియా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు చీరాల జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు. చీరాల–స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ, దిగువ లైన్ల మధ్యలో వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మృతుడి వయస్సు 25 ఏళ్లు ఉంటాయని, ఎటువంటి సమాచారం లభించలేదని చెప్పారు. ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉంటాడనే అనుమానాన్ని ఎస్సై వ్యక్తంచేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.